వాస్తవం కల్పన కన్నా చిత్రమైందన్న నిజం అక్కడ వాళ్లిద్దరినీ చూడగానే మాకర్థమైంది. సైట్ సీయింగ్ కోసమని డల్‌హౌసీ స్క్వేర్‌లోని బెంగాల్ టూరిజం ఆఫీస్‌కి చేరుకున్న మమ్మల్ని చూసిన వాళ్ల ముఖాల్లోనూ అదే భావం తొంగిచూస్తుంటే "హో గాడ్స్ గ్రేస్. ఈ కోల్‌కత్తా సిటీలో తిరిగి మనం కలుసుకోవడం అదీ ఓ రోజంతా కల్సి తిరగబోవడం మామూలు విషయంకాదు!" కూర్చుని ఉన్న వాళ్లిద్దరూ లేచి



# మేడిపండు

నిలబడుతూ అన్నారు.

"ఔన్నిజమే!" అన్నాడు మధు.

వాళ్లనలా చూస్తుంటే మూడు రోజుల క్రిందటి ఆ సంఘటన కళ్ల ముందు కదలాడుతూ నన్ను ఆలోచనా వలయాల్లోకి ఈడ్చుకుపోయింది.

కోల్‌కత్తాలో మేం పూర్తిచేసిన ఎసైన్‌మెంట్ రూరల్ ఏరియా డెవలప్‌మెంట్‌లో టి.వి. ఛానల్స్ పాత్ర తాలూకు నివేదికను యాత్ర నివాస్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన సదస్సులో సమర్పించి బైటపడిన మేము హౌరా బ్రిడ్జికి ఉత్తరం వైపునున్న సిటీస్టాండ్ మీదుగా ముందుకు కదిలి ఎదురొచ్చిన ఫ్లైఓవర్‌కి కుడివైపు రోడ్డులోకి తిరిగి సబ్జి మండి ముందు నుంచి నడవసాగాము...

ఆ రోడ్డుకి రెండువైపులా ఉన్న మురుగు కాలువలు పూడిపోయి నీళ్లన్నీ రోడ్డు మీదికి పారుతున్నాయి. మండీలో పోగైన చెత్తనంతా తెచ్చి రోడ్డుపక్కనే పోయడంతో ఆ చెత్తంతా కొండలా పెరిగిపోయి రోడ్డు మీదికి రావడంతో దాని మీదుగానే వాహనాలు నడవడంతో రోడ్డంతా గలీజుగా తయారై కాలుపెట్ట వీలు లేకుండా ఉంది. ఆ రోడ్డుకి రెండువైపులా ఉన్న చిన్న, చిన్న హోటళ్ల ముందు వేయిస్తున్న చేపల వాసన ముక్కుపుటాలను బద్దలు చేస్తోంది.

మురుగునీటి చెమ్మకు నాని నాచు పేరుకుపోతున్న ఫుట్‌పాత్‌ల మీద బస్తాచింపులో, పాలిథీన్ కవర్లో అడ్డుకట్టుకుని బ్రతుకు వెల్లదీస్తున్న అభాగ్యులు చీమల పుట్టల్లా కన్పిస్తున్నారు.

మేము చూస్తున్నవి నిజంగా వాస్తవ దృశ్యాలేనా? లేకపోతే సత్యజిత్‌రే సినిమాల్లోని కల్పిత దృశ్యాలా అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న నన్ను ఉద్దేశిస్తూ "అబ్బా గురూ! ఈ మనుషులెంత దారుణంగా బ్రతుకుతున్నారో చూడు!" మునగచెట్టు కొమ్మలకు పట్టిన గొంగళి పురుగుల తెట్టును చూస్తున్నంత జుగుప్సగా వాళ్లను చూస్తూ అన్నాడు వెంకట్.

"అందుకే దీన్ని డెడ్‌సిటి అంటారేమో గురూ!" వెంకట్ మాటలకు ప్రతిస్పందనగా అన్నాడు మధు.

"ఎందుకు సార్! ఆ అభాగ్యులను అంతగా అసహ్యించుకుంటారు?! సజావుగా బ్రతకడానికి అవకాశాలు కల్పిస్తే వాళ్లూ అందరిలాగే బ్రతుకుతారని నిరూపించిన మదర్ పుట్టుకకు స్ఫూర్తినిచ్చింది వీళ్లే సార్!" అదోరకమైన యాస తెలుగులో మా వెనుకనుంచి ఎవరో వ్యాఖ్యానించడంతో నడుస్తున్న మేము ఒక్కసారిగా వెనుదిరిగి చూశాము.

అంతే!

"వీళ్లా!? ఇప్పటిదాకా మాట్లాడింది?!" అన్న ఆశ్చర్యానికి లోనయ్యాము.

మా సందిగ్ధతను గమనించిన ఆ యువతీ యువకులిద్దరిలో యువకుడి పెదవుల మీద చిరునవ్వు విరిసీ విరియని విరజాజిలా తొంగి చూస్తుంటే "మేమే అన్నాం" అన్నాడు.

"మీరు తెలుగులో...!" ఇంకా నమ్మకం

**శిరంశెట్టి కాంతారావు**

కుదరనట్లుగా ఉంది మధు గొంతు.

"ఔను మేమే మాట్లాడాం" అదే నవ్వు ముఖంతో అన్నాడా యువకుడు.

"వీళ్లేంటి? తెలుగు మాట్లాడడమేంటి!?" అన్న మా సందేహాన్ని నివృత్తి చేయడానికా అన్నట్టు ముందుకొచ్చిన యువతి "ఓ అదా మీ సంశయం. లండన్ యూనివర్సిటీలో మాతోపాటు చదువుకుంటున్న మా బెస్ట్‌ఫ్రెండ్ అశోక్ శిరంశెట్టి పదహారణాల తెలుగువాడే. అతని దగ్గర మేం తెలుగు నేర్చుకున్నాం. మేం తెలుగు మాట్లాడడమే కాదు తెలుగులో సీస పద్యాలను కూడా వ్రాయగలం" అంటూ మా సందేహాన్ని పటాపంచలు చేస్తూ మమ్మల్ని మరింత ఆశ్చర్యంలోకి పడేసింది.

"హో అద్భుతం" తన భావోద్వేగాన్ని ఏమాత్రం దాచుకోకుండా అన్నాడు మధు.

"ఔను! నిజంగా మీ దేశమే ఓ అద్భుతం. అందులోనూ మీ తెలుగు భాష మరీ అద్భుతం. అందుకే కష్టమైనా మీ తెలుగును ఇష్టపడి నేర్చుకున్నాం. ఈ దేశాన్ని ప్రత్యక్షంగా చూడాలని, తెలుగువాళ్లను కలిసి మాట్లాడాలనీ బయలుదేరి వచ్చాము. మాతోపాటే రావాల్సిన అశోక్కి చివరిక్షణాల్లో ఏదో అర్జంట్ అకడమిక్ వర్క్ తగలడంతో ఆగిపోయాడు" మళ్లీ తనే వివరించిందా అమ్మాయి.

"యువర్ గుడ్ నేమ్స్ ప్లీజ్" అప్పటిదాకా మౌనంగా ఉన్న వెంకట్ ముందుకు దూసుకొస్తూ అడిగాడు.

"మారియా"

"జేమ్స్"

"సోగుడ్. ఆర్ యు లవర్స్?" తనకు తనే తెలివైన వాడిలా భుజాలు తడుముకుంటూ ఓ వెర్రి ప్రశ్నను హఠాత్‌గా సంధించాడు వెంకట్.

"కాదండీ! అక్కా-తమ్ముళ్లం" కూల్‌గా సమాధానం చెప్పింది మారియా.

అంతే! తలమీద పిడుగుపడిన కొబ్బరి చెట్టులా మాడిపోయిన వెంకట్ ఓ జీవంలేని నవ్వు మాటున తన తొందరపాటును కప్పి పుచ్చుకుంటూ "ఐయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ!" అన్నాడు.

"ఇట్సోకే! మీరలా భావించడంలో తప్పు లేదులే. ఎందుకంటే మా సంస్కృతి మీద మీకుండే అవగాహన అలాంటిది మరి." ఆమె వ్యక్తిత్వం ముందు మేము మరుగుజ్జులమై పోతుంటే... క్షమాగుణంలో భూమాతను గుర్తుకు తెస్తూ నెమ్మదిగా అంది మారియా.

ఆమె ఎంత స్నేహపూరితంగా మాట్లాడుతుంటే... మాలో అంతగా ఆత్మన్యూనతాభావం పెరిగిపోతూ మేము ఇబ్బంది పడుతున్న సమయంలోనే అటుగా పోతున్న ఓ టాక్సీని ఆపిన ఆ అక్కా, తమ్ముళ్లు ఆప్యాయంగా ఒకరి చేతులు ఒకరు పట్టుకుంటూ టాక్సీలో కూర్చుని "హోటల్ షియాల్డా" అన్నారు.

మేము కన్పించేంత వరకూ చేతులూపుతూనే వెళ్లిపోయిన వాళ్ల వ్యక్తిత్వ పరిమళాలు హుగ్లీ నది మీదనుంచి వస్తున్న పిల్లతెమ్మెరల్లా మమ్మల్ని వలయాలు, వలయాలుగా చుట్టేస్తుంటే... "ఎలా మొదలైన సంభాషణ ఎలా ముగిసిపోయింది? కొన్ని కొన్ని పరిచయాలు ఇలాగే ఉంటాయి కాబోలు" అనుకుంటూ మెల్లగా మా హోటల్‌కి చేరుకున్నాము.

"హలో సర్! ఆర్ యు ఓకె" ఆలోచనా వలయాల్లో నుంచి నన్ను ఒడ్డుకు గుంజుతూ అన్నాడు జేమ్స్.

"మరో పదిహేను నిమిషాల్లో బయలు దేరడానికి మీరంతా రెడీగా ఉండండి" అంటూ అంతలోనే హిందీ, ఇంగ్లీష్, బెంగాలి, భాషల్లో ఎనౌన్స్‌మెంట్ ఇచ్చిన అమ్మాయి బయలుదేరబోయే బస్సుకి 'గైడ్' నంటూ తన్ను తనే పరిచయం చేసుకుంది గైడ్ శాలినీ ముఖర్జీ.

అప్పటికే సైట్ సీయింగ్‌కొచ్చిన టూరిస్ట్‌లతో ఆ టూరిజం డిపార్ట్‌మెంట్ ఆఫీసంతా సందడి సందడిగా తయారైనప్పటికీ అదంతా పట్టించుకోని నేను మారియా, జేమ్స్‌ల వైపు మరోసారి పరిశీలనగా చూశాను.

తెల్లని వాళ్ల శరీరాలు ఉషోదయాన మంచు బింధువులతో మెరుస్తూ... గాలి వాలున లయాత్మకంగా ఊగుతున్న లిల్లీపూవుల్లా ఉన్నాయి. వాళ్ల తలమీద వెంట్రుకలు ఎర్రగోధుమ గింజల రంగులతో ఉన్నాయి. పారిజాత పూవుల్లాంటి తేనెకళ్లు, శౌశీపూల పంకీలంత అందమైన ముక్కులు.

మారియా నెమలి పింఛం రంగు చీరకట్టుకుని, అదేరంగు బ్లౌజ్ తొడుక్కుంది. బాబ్డ్‌హెయిర్ గాలికి రేగకుండా హెయిర్‌బాండ్ పెట్టుకుంది. ఆమె చెవులకున్న డైమండ్ రింగులు ఉండి ఉండి కదులుతున్నాయి.

ఇక బిల్ల గోరింటరంగు కాటన్‌ఫ్యాంట్‌లో మీగడ తరగరంగు కాటన్ బుషర్ట్ టక్ చేసుకున్న జేమ్స్ కుడి పాపిటతో దువ్విన జుట్టు మాటి మాటికీ చెంపమీదికి జారుతుంటే ఎడమ చేత్తో పదే పదే పైకి జరుపుకుంటున్నాడు.

అక్కా, తమ్ముళ్లిద్దరూ నల్లటి ఫోం లెదర్ సాదా చెప్పులేసుకుని సింపుల్‌గా ఉన్నారు.

"టైమ్ అయ్యింది బయలుదేరుదామా?" అంటూ షాలినీ ముఖర్జి బైటికి నడవడంతో వచ్చినసందర్శకులంతా బిలబిలమంటూ బస్సులోకెక్కి ఎవరి సీట్లల్లో వాళ్లు సర్దుక్కూర్చున్నారు.

మరో ఇరవై నిమిషాల తరువాత మా బస్సు కోల్‌కత్తా రోడ్లమీది జనసంద్రాన్ని ఈదడం మొదలుపెట్టింది.

బేలూర్ మఠం ముందు పార్కింగ్ ప్లేస్‌లో ఆగిన బస్సులో నుంచి దిగిన మేము మఠంవైపు నడుస్తుంటే... మఠానికి తూరుపు దిశగా ఉన్న గంగానది అలల మీదుగా కదలివస్తున్న పిల్ల తెమ్మెరలు మా తనువులను ఆత్మీయంగా చుట్టేస్తుంటే... అరమోడ్పులౌతున్న కన్నులతో మనస్సులు దూది పింజల్లా తేలిపోతుంటే... పరమ హంస తిరుగాడిన నేలమీద నడుస్తున్నామన్న భావన ఒకటి హృదాంతరాల్లో చిరు కంపనలు కలిగిస్తుంటే మెల్లగా మందిరం చేరుకున్నాము.

మందిరం లోపల పరమ నిశ్శబ్దంగా ఉంది.

పరమహంస ఉన్న ప్రధాన ద్వారం తెరవడానికి ఇంకా సమయం ఉందన్న ప్రకటన చదువుకున్న మారియా, జేమ్స్‌లిద్దరూ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా అక్కడ ధ్యానం చేసుకుంటున్న వందల మందిలో కలిసిపోయి కూర్చుంటూ కళ్లు మూసుకుంటూ ధ్యానంలోకి వెళ్లిపోయారు!

"ఇక్కడుండి మనం చేసేదేమిలేదు. బైటికి వెళదాం పదండి" అన్నట్టు తన మోచేతితో మా డొక్కల్లో పొడుస్తున్న వెంకట్ బాధకు తట్టుకోలేక మెల్లగా బైటకు నడిచాం.

భారతీయ తాత్విక చింతనకు వారధులుగా నిలిచిన పరమహంస శిష్య పరంపర సమాధులన్నిటినీ ఓ గంటసేపు సందర్శించి మళ్లీ బస్సెక్కాము.

బస్సు కలకత్తా కాళిక గుడి పరిసరాల్లోకి వెళ్లేసరికి, పోటెత్తిన సంద్రంలా రోడ్లన్నీ భక్త జనంతో కిటకిటలాడిపోతున్నాయి.

'గుడి' అంటే అలల హోరులేని ప్రశాంత సాగరంలా ఉండాలి తప్ప, ఇలా ప్రళయ ఝుంఝూ ధ్వానంలా హోరెత్తిపోతుంటే మనసు నిర్మలంగా ఉండేదెలా? భగవంతుణ్ణి స్మరించుకునేదెలా?

బస్సు ఆగిన దగ్గర నుంచి జనాన్ని తప్పించుకుంటూ ముందుకు కదులుతున్న మారియా "ఈరోజేమైనా ప్రత్యేక కార్యక్రమాలున్నాయేమో!? అందుకే ఇంత రష్‌గా ఉంది. "తన వెనుకనే వస్తున్న జేమ్స్‌తో అంటూనే అక్కడ ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్ గుండా కదిలి పోలీసుల తనిఖీలను ముగించుకుని ప్రధాన ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టేసరికి అర గంటకు పైగా పట్టింది.

"చూశారా? మాత దర్శనంకోసం ఎంతెంత క్యూలున్నాయో? మీరంతా వెళ్లి త్వరగా క్యూలో నిల్చోండి" ఆలయ ప్రాంగణంలో అడుగు పెడుతూనే మా అందరికీ సలహా ఇచ్చింది గైడ్ శాలిని.

"అబ్బో! ఇంతింత పెద్ద క్యూలో నిల్చుని దర్శనం చేసుకుంటేనే దేవుణ్ణి కొలిచినట్టా? నావల్ల కాదులే బాబు! ఇక్కణ్ణుంచే దండం పెట్టుకుంటా" అంటూ నిల్చున్న దగ్గరే రెండు చేతులూ పైకెత్తి గుడి వైపు తిరిగి దండం పెట్టుకున్న వెంకట్ ఆ పక్కనే ఉన్న చిన్న, చిన్న శివ మందిరాల మెట్లమీద కూర్చున్నాడు.

"నాదీ నీదారే గురూ!" అంటూ మధు కూడా వంతపాడుతూ వెళ్లి వెంకట్ పక్కనే కూర్చున్నాడు. నీళ్లల్లో వదిలిన చేపల్లా మిగతా సందర్శకులంతా ఎటెటో మాయమైపోయ్యారు.

ఐతే, గైడ్ మాటలు వింటూనే చిత్రంగా మారియా, జేమ్స్‌లిద్దరూ దైవదర్శనం కోసం క్యూలో నిల్చున్నారు. గడియారంలో లోలకంలా కాస్సేపు అటూ, ఇటూ ఊగిసలాడిన నేను ఆఖరికి వెళ్లి క్యూలో నిల్చున్నాను. మొత్తం మీద కాళీ దర్శనం చేసుకుని బైట పడేసరికి గంట పైనే పట్టింది.

మారియా గుళ్లో నుంచి తాను తెచ్చిన ప్రసాదాన్ని మా అందరికీ పంచిన తరువాత మిగిలింది కళ్ల కద్దుకుని నోట్లో వేసుకుంది!

ఆ సంస్కారానికీ, ఈ సంస్కృతికీ మధ్య ఏ జన్మ సంబంధమో!? నిజంగా ఆ అమ్మాయిని చూస్తుంటే ఒక జాతిలో పుట్టినంత మాత్రాన నిజంగా ఆ సంస్కృతికి సిసలైన వారసులౌతారా? ఇక్కడ ఈ క్షణంలో ఈ సంస్కృతికి ఎవరు నిజమైన వారసులు?

నా తల నిండా ప్రశ్నల జోరీగలు.

ప్రవేశరుసుం మనిషికి పది రూపాయలు!

విదేశీయులకు నూటా యాభై రూపాయలు!!

కోల్‌కత్తా సెంట్రల్ మ్యూజియం కౌంటర్లో టిక్కెట్లకోసం నిల్చున్న నేను ఎదురుగా ఉన్న బోర్డుమీది ప్రకటనను చూసి "అదేంటి!? విదేశీయులనగానే ప్రతి వాళ్లూ రూపాయి వస్తువును పది రూపాయలకు అంటగట్టడం చూస్తుంటేనే 'అయ్యో' అనుకున్న నేను ప్రభుత్వ పరంగానూ అదే జరుగుతుండడంతో ఒక్కక్షణం ఆశ్చర్యపోతూ 'అతిథి దేవోభవ' అని ఘోషించిన భూమిలో ఇంత మార్పా? మూలాల నుంచి ఎంతదూరం జరిగిపొయ్యాం? ముం దు, ముందు ఇంకా ఏం జరుగబోతుంది? అన్నీ సమాధానాలు లేని ప్రశ్నలే.

"ఏ దేశమైనా తన పౌరులకిచ్చే ప్రతి రాయితీనీ విదేశీయులకు కూడా ఇవ్వాలంటే సాధ్యం కాదులెండి" నాలో చెలరేగుతున్న సంఘర్షణను అర్థంచేసుకుంటూ అన్నాడు జేమ్స్ నా వెనుకే అడుగులేస్తూ...

ప్రపంచమే ఓ గ్రామంగా మారిపోతూ... విశ్వనరుని భావన ముందుకొస్తున్న రోజుల్లో ఎవరు స్వదేశీయులు? ఎవరు విదేశీయులు? ఆలోచనలతోనే మ్యూజియంలోకి అడుగు పెట్టాము.

మా సైట్ సీయింగ్‌లో ఆఖరి మజిలీ విక్టోరియా మెమోరియల్.

ఆ చలువరాతి అద్భుత కట్టడాన్ని విస్మయంతో వీక్షిస్తూ లోపలికి అడుగుపెడుతున్న మా అందరినీ ఉద్దేశిస్తూ "చూడండి ఫ్రెండ్స్! మీరంతా ఇక్కడికొచ్చింది కేవలం ఈ మెమోరియల్ని చూడ్డానికి మాత్రమేనని గుర్తుంచుకోండి" అని చెబుతున్న గైడ్ మాటల్ని విన్న నాకెందుకోగాని చిత్రమనిపిస్తుంటే... అందరితో పాటు కలిసి ఆ కట్టడం చుట్టూ విశాలంగా పరుచుకున్న పచ్చిక మైదానాన్ని, ఆ మైదానంలో ఎంతో కళాత్మకంగా పెంచబడిన రకరకాల పూపొదలను పెద్ద పెద్ద వృక్షాలనూ కళ్లు విప్పార్చి చూస్తూ ముందుకు నడవసాగాను.

అంతలో...

"హ్హా క్యాసీన్ హై బాస్!" నడుస్తున్న టూరిస్టుల్లో ఓ యువకుడు ఓ వెర్రికేక వేశాడు.

"ఏంటది?!" మేమంతా ఆశ్చర్యంగా అతను చూస్తున్న వైపు చూసీ చూడ్డంతోటే కొయ్యబారిపోయాం.

"ఛీ ఛీ" అంటూ చప్పున తలలు తిప్పుకున్నారు.

"ఎంత పాపపు రోజులొచ్చాయ్!" అనుకుంటూ చాలామంది తమ చూపుల్ని తిప్పుకున్నారు. ఇంతకూ అక్కడ చూసిందేమిటి?

పచ్చిక బయళ్లలోని చెట్ల చుట్టూ ఉన్న బల్లలమీద కూర్చున్న స్త్రీ పురుషులంతా సిగ్గెగ్గులు విస్మరించి స్త్రీ పురుషుల మధ్య గోప్యంగా, పవిత్రంగా జరగాల్సిన కార్యకలాపాలను పట్టపగలు అలా బరితెగించి! కాపాడాల్సిన కంచే చేను మేసినట్టు, యువతరం వెర్రి చేష్టలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వమే ఆదాయం కోసం టిక్కెట్లు పెట్టి మరీ ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తుంటే ఇక చెప్పేదెవ్వరికి?

శుక మహర్షిలా ముందుకు కదులుతున్న గైడ్ షాలినీ ముఖర్జీని చూస్తుంటే ఇంతకు ముందు ఆవిడన్న మాటలకు అర్థమేంటో ఇప్పుడు నా తలకెక్కింది.

ఆ జంటలను చూస్తుంటే "వీళ్లంతా ఏ విషవలయంలోపడి, ఎటు కొట్టుకుపోతున్నారో కదా?" అన్న ఆలోచనలో మునిగిపోయిన నాకు "దిస్ ఈజ్ టూమచ్! ఈ దేశాన్ని, ఈ దేశ సంస్కృతీ సాంప్రదాయాలనూ గురించి మేము విన్నది వేరు, ఇక్కడ చూస్తున్నది వేరు. ఇలాంటి కల్చర్ చూడ్డానికా మేమింత దూర మొచ్చింది? మా దేశంలో వీధి, వీధికీ ఉండే ఏ పబ్‌లోకి వెళ్లినా చాలు" అంటున్న మాటలు నా చెవుల్లో పడడంతో వాస్తవంలోకొచ్చి చూసే సరికి తమ్ముని చెయ్యి పట్టుకుని బిర బిరా వెనుదిరిగి పోతున్న మారియా కన్పించింది.

సిగ్గుతో కందిపోయిన సూర్యుడు విక్టోరియా మెమోరియల్ శిఖరం వెనుకగా మబ్బుల్లో ముఖం చాటేశాడు.

*(కలకత్తాలో ఇటీవల చూసిన వాస్తవ దృశ్యానికి కథారూపం)*